# ప్రజాశక్తి

గురువారం 22 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి


# ఉక్కు సమ్మెపై నిర్బంధం ఆపాలి

నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖ ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమ్మెపై రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం పోలీస్ నిర్బంధాన్ని తక్షణమే నిలిపివేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం జగదాంబ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కులోని 4000 మంది కాంట్రాక్టు కార్మికులను అమానుషంగా తొలగించిందని, మరో 2,600 మందిని తొలగించడానికి రంగం సిద్ధం చేసిందని అన్నారు. సంస్థ ఉత్పత్తిలో దశాబ్దాల తరబడి కీలక పాత్ర పోషిస్తూ, తమ జీవితాలను ఫణంగా పెట్టిన కాంట్రాక్ట్ కార్మికులను వేల సంఖ్యలో అర్ధాంతరంగా రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు. ఈ తొలగింపులలో కార్మిక చట్టాలను పూర్తిగా కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. తమ

### వామపక్షాల డిమాండ్

ఉపాధిని, కుటుంబాలను రక్షించుకోవడం కోసం విశాఖ ఉక్కు కాంటాక్ట్ కార్మికులు గత్యంతరం లేక నిరవధిక సమ్మెకు పూనుకున్నారని తెలిపారు. కార్మికుల ఉపాధిని కాపాడి, వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా నిరవధిక సమ్మె విచ్ఛిన్నానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు కుట్రలు కొనసాగిస్తున్న మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలికేలా ఉన్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ 40 సంవత్సరాల చరిత్రలో కేంద్రం, రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా స్టీల్‌ప్లాంట్ లోపల డిపార్టుమెంట్లలో రాష్ట్ర పోలీసులను ఉపయోగించి కార్మికులను, కార్మిక నాయకులను అరెస్టులు చేయడం, బెదిరించడం వంటి నిర్బంధ చర్యలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు దుశ్చర్యలకు పూనుకోవడం దారుణమన్నారు. కూటమి పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిర్బంధంపై ఆందోళనలు చేసి, ప్రజాస్వామ్య హక్కుల గురించి ప్రసంగాలు చేసి, అధికారంలోకి రాగానే వాటిని మరచి నిర్బంధం మిగతా 2లో..

మాట్లాడుతున్న మంత్రి నారాయణ

# ఏప్రిల్‌కు భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి

- అక్టోబర్‌లో విశాఖ మెట్రో పనులు మొదలు
- దసరాకు టిడ్కో గృహాల అందజేత
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ :** భోగాపురం ఎయిర్‌పోర్టు వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. బుధవారం ఉదయం విఎంఆర్‌డిఎ కార్యాలయంలో ఆయన రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, నగర మేయర్ పీలా శ్రీనివాస్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌లతో కలసి నగర అభివృద్ధి, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్టు వచ్చే ఏడాది ఏప్రిల్‌కు పూర్తవుతుందన్నారు. దాన్ని అనుసంధానం చేస్తూ 22 రోడ్లను ప్రతిపాదించామని, వాటిలో 15 రోడ్లు పూర్తవుతున్నాయని తెలిపారు. మిగిలిన ఆరు రోడ్లుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జాతీయ రహదారి సంస్థతో సమన్వయం చేసుకుని నూతన రోడ్లు నిర్మిస్తామని మిగతా 2లో..

## అప్పలరాజు ఆశయ సాధనకు కృషి

వార్త 4లో..

## మిడ్డేమీల్స్ బిల్లులు విడుదల చేయాలని ధర్నా

వార్త 5లో..

## ఘనంగా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

వార్త 8లో..

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు

## విశాఖ ఖ్యాతిని పెంచేలా యోగా మాసోత్సవాలు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వార్త 2లో..

# పెరిగిన జలాశయాల నీటిమట్టాలు

- గతేడాది కంటే మెరుగ్గా నిల్వలు
- ఖరీఫ్‌పై రైతుల ధీమా

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

జిల్లాలోని జలాశయాల్లో నీరు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఖరీఫ్‌లో వరి సాగుపై ధీమాగా ఉన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు పెరిగాయి. జలాశయాల పరివాహక ప్రాంతాల్లో వర్షాలు పడ్డంతో జలాశయాల్లో నీరు దాదాపు స్థిరంగా వుంది. తాండవలో 206, రైవాడలో 169, కోనాంలో 30, పెద్దేరు జలాశయంలో 35 క్యూసెక్కుల నీరు బుధవారం చేరింది. కొన్ని రోజులు జలాశయాల్లోకి నీటి ప్రవాహం ఇలా కొనసాగితే గరిష్ట స్థాయికి నీటిమట్టాలు చేరుకుంటాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.87 లక్షల ఎకరాల పంటల సాగు అంచనాలో అత్యధికంగా వరి 1.45 లక్షల ఎకరాల్లో సాగుకానుంది. జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగితే గతేడాది కంటే ముందుగానే నీరు విడిచిపెడతామని నీటిపారుదల శాఖాధికారులు చెబుతున్నారు.

రైవాడ జలాశయంలోకి చేరిన నీరు

తాండవ జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 380 అడుగులకుగాను బుధవారం నాటికి 365 అడుగులకు చేరింది. గతేడాది ఇదే రోజుకు మిగతా 2లో..

## విశాఖలో భారీ వర్షం

వార్త 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### ఉక్కు సమ్మెపై నిర్బంధం ఆపాలి

ప్రయోగించడం ప్రజలను, కార్మికులను వంచించడమేనని విమర్శించారు. ఉక్కు రక్షణపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వేల సంఖ్యలో కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుంటే సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ నోరు మెదపకపోవడం కార్మికులకు, వారి కుటుంబాలకు ద్రోహం చేయడమేనన్నారు. కూటమి తీరు మారకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు జిల్లా కన్వీనర్ దేవ సహాయం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి, జిల్లా నాయకులు బి.ఈశ్వరమ్మ, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, వై.రాజు, టి.నూకరాజు, సిపిఐ జిల్లా నాయకులు ఎం.మన్మధరావు పాల్గొన్నారు.

### పెరిగిన జలాశయాల నీటిమట్టాలు

355.70 అడుగుల నీరు వుంది. రైవాడలో 114 మీటర్లకు 111 మీటర్ల నీరు వుండగా, గతేడాది ఇదే రోజుకు 104.75 నీరు వుంది. కోనాంలో 101.25 మీటర్లకు 95.70 మీటర్ల నీరువుండగా, గతేడాది ఇదే రోజుకు 95.40 మీటర్ల నీరు వుంది. పెద్దేరులో 137 మీటర్లకు 134.90 మీటర్ల నీరు వుంది. గతేడాది 135.65 మీటర్ల నీటి నిల్వ వుంది. అయితే, జలాశయాల నుంచి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా ప్రధాన గేట్ల లీకేజీలు, ప్రధాన, పిల్ల కాలువల మరమ్మతులు పూర్తిచేయాల్సివుంది.

జోరువానలోనే సాగుతున్న ప్రయాణాలు

### విశాఖలో భారీ వర్షం

**ఎంవిపి.కాలనీ :** విశాఖ జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి, గాజువాక, కూర్మన్నపాలెం, గోపాలపట్నం, మద్దిలపాలెం ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చావులమధుం వద్ద మురుగునీటి ప్రవాహంలోనే రాకపోకలు సాగాయి.

### ఏప్రిల్‌కు భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి

స్పష్టం చేశారు.

టిడ్కో ఇళ్లకు సంబంధించి 2014-2019 మధ్య ఏడు లక్షల ఇళ్లు ప్రతిపాదించామని, గత ప్రభుత్వం 2 లక్షల ఇళ్లు కూడా పూర్తి చెయ్యలేక పోయిందని చెప్పారు. వాటిని పూర్తి చేయాలంటే సుమారు ఏడు వేల కోట్లు కావాలని, ఎంతటి ఖర్చయినా మహిళలకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారని తెలిపారు. ఈ దసరాకు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందిస్తామన్నారు. ప్రతి ఇంటికీ మంచి నీరిచ్చేలా 2021లో అమృత పథకం కోసం కేంద్రం నిధులిస్తే గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేనందున ఆ నిధులు వెనక్కి వెళ్లి పోయాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి మళ్లీ నిధులు వచ్చేలా చేశారని, 834 కోట్ల పనులు అమృత్ పథకం కోసం నిర్దేశించామని చెప్పారు. రాబోయే కొద్దినెలల్లో అమత్ పథకం ద్వారా సర్ఫేస్ వాటర్ వస్తుందన్నారు. విశాఖ మెట్రోకు సంబంధించి అక్టోబర్‌లో పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. డబుల్ డెక్కర్ మెట్రో కింద డిపిఆర్ ఇచ్చామని తెలిపారు. హైదరాబాద్‌కు రింగ్ రోడ్డు తరహాలో విశాఖలో సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సంపత్ కుమార్, ఎపిఇపిడిసిఎల్ ఎమ్‌డి పృధ్వీ తేజ్,, విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ గణబాబు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్ రాజు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, అతిథి గజపతిరావు, లోకం మాధవి, కె.లలిత కుమారి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డిప్యూటీ మేయర్ గోవిందరాజు, జిల్లా రెవెన్యూ అధికారి భవాని శంకర్, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** పెద వాల్తేరు ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన నరవ బాబూరావు అనారోగ్యంతో మనస్తాపానికి గురై తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య నరవ కోమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో సేల్స్ మేనేజర్‌గా పనిచేసిన బాబూరావు గుండె సమస్యల కారణంగా రెండు సార్లు స్టంట్‌లు వేసుకున్నాడు. ప్రస్తుతం ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నాడు.

# విశాఖ ఖ్యాతిని పెంచేలా యోగా మాసోత్సవాలు

**ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ:** విశాఖ మహా నగర విశిష్టతను, ఖ్యాతిని రెట్టింపు చేసేలా యోగా మాసోత్సవాలను కలిసికట్టుగా నిర్వహించాలని విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్‌కె బీచ్ వద్ద యోగాంధ్ర నెలావారీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకను రికార్డు స్థాయిలో నిర్వహించేందుకు అందరినీ సిద్ధం చేస్తున్నామన్నారు. టిఒటిలకు వారి ద్వారా మిగిలిన వారికి యోగా శిక్షణ అందించేందుకు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ద్వారా సర్టిఫికెట్లు అందజేసేందుకు, తదుపరి ప్రక్రియలు నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. ప్రజలంతా ఈ నెల రోజులు జరిగే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి సూచన మేరకు యోగా మంత్‌లో భాగంగా శిక్షణ, ప్రత్యేక యోగా, జలయోగా, అంధులకు నిర్వహించే యోగా వంటి ప్రక్రియలు నిర్వహిస్తామన్నారు.

**యోగా మాసోత్సవాల షెడ్యూల్**

మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మాసోత్సవాలు నిర్వహిస్తామని, జూన్ 21న ప్రధాన కార్యక్రమంలో ప్రధాని, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ప్రముఖులు భాగస్వామ్యం అవుతారని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందిని, ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో సుమారు 5 లక్షల మందిని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు వేపాడ చిరంజీవిరావు, గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, జెసి మయూర్‌అశోక్, డిఆర్ఒ బిహెచ్ భవానీశంకర్ ఇతర అధికారులు పాల్గొని యోగాసనాలు వేశారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకలో చిన్నారులు వేసిన ఆసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**అనకాపల్లి :** ఆరోగ్యమే సంపద అని, ప్రతి ఒక్కరు వారి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని, శారీరక శ్రమకు ప్రతి రోజు కొంతసమయం కేటాయించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం జిల్లా స్థాయి ప్రారంభ వేడులను బుధవారం బొజ్జన్నకొండ వద్ద ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాగం, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. 500 మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు.

యోగా లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె. బాబూరావు, డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వై.శ్రీనివాసరావు, జిల్లా ఆయుష్ మెడికల్ అధికారి డాక్టర్ శిరీష, అనకాపల్లి మెడికల్ అధికారి కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** దళితులపై జరుగుతున్న దాడులు తక్షణం ఆపాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న డిమాండ్ చేశారు. బుధవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరుగుతున్నా యన్నారు. నెల్లూరు జిల్లా గూడూరు మండలం దప్పలంపాడు గ్రామంలో దళితులపై సాంఘిక బహిష్కరణ జరిగి దాన్ని మరిచిపోక ముందే, తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌ను చిత్రహింసలపాలు చేసి రౌడీషీటర్లు చంపడానికి ప్రయత్నించారని ఆరోపించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి మాట్లాడుతూ ఈ నెల 18న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం డొంకాడ గ్రామం దళితులు టెంట్‌హౌస్ పనులు చేస్తుంటారని, డొంకాడలో జి.వి లచ్చుబాబు వివాహంలో వారి సెల్‌ఫోన్ పోయిందని, దళితులే చోరీ చేశారని వారిని కొట్టారన్నారు. ఎందుకు కొడుతున్నారని దళిత పెద్దలు వెళ్లి అడుగగా, వారిని కూడా మారణాయుధాలతో కొట్టారన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ అధికార పర్యటనలో మహారాష్ట్రకు వెళితే అక్కడి బిజెపి ప్రభుత్వం అవమానించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణి మారకపోతే, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

### 550 గ్రాముల శిశువుకు ప్రాణం పోసిన వైద్యులు

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:** విశాఖపట్నం మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అత్యంత తక్కువ బరువుతో జన్మించిన శిశువుకి ప్రాణం పోశారు. కేవలంన 550 గ్రాముల బరువు మాత్రమే ఉన్న ఆడ శిశువును చికిత్స చేసి రక్షించారు. వంధ్యత్వంతో పాటూ అధిక రక్తపోటు కలిగిఉన్న తల్లికి ఈ శిశువు జన్మించింది. గర్భం దాల్చిన కేవలం 25 వారాలకే జన్మించిన ఈ అసాధారణ శిశువు ఇప్పుడు ఆరోగ్యంగా ఉంది. 35 రోజుల తరువాత 1.7 కిలోల బరువుతో, సాధారణ మెదడు దృష్టి పనితీరు కలిగి ఉంది. దీంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్టు మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. పాపతల్లి లండన్ ఐవిఎఫ్ సెంటర్‌లో చాలా సంవత్సరాల వంధ్యత్వ చికిత్స తర్వాత గర్భం దాల్చింది. అక్కడ వైద్యుల రిఫరెన్స్ మేరకు మెడికవర్‌లో చీఫ్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్‌కిషోర్‌ను సంప్రదించగా డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రీరంగ నర్సింగ్ బృందంతో అహర్నిశలు శ్రమించి శిశువును కాపాడామని డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ తెలిపారు.

## ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ :** ఎపిఎస్ ఆర్‌టిసి ద్వారకా బస్టాండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ (స్వీపర్స్), అద్దె బస్సు డ్రైవర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, విశాఖ జిల్లా ఆర్‌టిసి ప్రజా రవాణాసంస్థ (ఆర్ఎం) కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎస్ ఆర్‌టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ లేబర్‌యాక్ట్ ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్స్‌కి ఆర్‌టిసి కాంట్రాక్టర్స్ వేతనాలు చెల్లించడం లేదన్నారు. ద్వారక బస్టాండ్ స్వీపర్స్‌కు రూ.10,554 చెల్లించవలసి ఉండగా కేవలం రూ.9,200 వేతనం మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారని, ఒక్కొక్క కార్మికుని దగ్గర సుమారు రూ.1300 కాంట్రాక్టర్ తీసుకోవడం అన్యాయమన్నారు. సర్క్యులర్ ప్రకారం మొత్తం వేతనం కాంట్రాక్టర్ కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## సిపిఎం కార్యాలయ నిర్మాణానికి విరాళం

గంగారావుకు చెక్కు అందజేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** మద్దిలపాలెంలో నిర్మిస్తున్న సిపిఎం నూతన కార్యాలయ భవన నిర్మాణానికి జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) తరపున రూ.3 లక్షల విరాళం అందజేశారు. బుధవారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావుకు రూ.3 లక్షల చెక్కును యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు, గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి అందించారు. వారికి గంగారావు ధన్యవాదాలు తెలిపారు.

### సుకుమారన్ మృతికి సంతాపం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** సిపిఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు, ఇస్కఫ్ జాతీయ నాయకులు, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ టిఎస్.సుకుమారన్ (76) మంగళవారం రాత్రి అనారోగ్యంతో విశాఖలోని ఎంవిపి.కాలనీలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య వినోలియా, ప్రవీణ్, ప్రదీప్ ఇద్దరు కుమారులు ఉన్నారు. సుకుమారన్ పార్థివదేహం వద్ద సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె .రెహమాన్, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు సి.హెచ్.రాఘవేంద్రరావు, అఖిలభారత ప్రొగ్రసివ్ ఫోరం అధ్యక్షులు ఆచార్య కె.ఎస్.చలం, పలు ప్రజా సంఘాల నాయకులు నివాళ్లర్పించారు.

**పాస్‌పోర్టు పోయినది**

నేను **వబ్బలరెడ్డి పవన్ కుమార్**
తండ్రి రాజు నాయుడు
తేదీ: 20-05-2025 నేను తూటిపాల నుండి మాకవరపాలెం బైక్‌లో వెళ్తుండగా నా పాస్‌పోర్టు పోయింది.
నా పాస్‌పోర్టు నెంబర్ **N9655503**
నా పాస్‌పోర్టు దొరికిన వారు కింది ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయగలరు.

**వి.పవన్ కుమార్**
**సెల్: 9908170036**

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM**
**S.O.P. 02 / 2023**

IN THE MATTER OF SUCCESSION CERTIFICATE TO THE ESTATE OF LATE Sri. KOMMARAJU VENKATA NARASIMHA RAO

Between :
1) Kommaraju Surya Kumari, W/o(L) Kommaraju Venkata Narasimha Rao, Hindu aged 60 years, resident of Door No.1-166-11, plot No.53/2, Sector-2, MVP Colony, Visakhapatnam.
2) Kommaraju Venkata Rama Srikanth, S/o.(L) Kommaraju Venkata Narasimha Rao, Hindu aged 36 years, resident of Door No.1-166-11, Plot No. 53/2, Sector - 2, MVP Colony, Visakhapatnam

**...Petitioners.**

**And :**
M/s HDFC MUTUAL FUND Rep. By its authorized Signatory, Situated at Investor Service Centre, Chennai, Tamilnadu (4017/HDFC BALANCED Advantage Fund - Regular Plan - Growth -INF179K01830 UCC : MFHDFC 0001

**...Respondent.**

**GENERAL NOTICE**

Please take notice that the above matter was filed by the petitioners, (01) Kommaraju Surya Kumari, (02) Kommaraju Venkata Rama Srikanth, for the grant of Succession certificate in their favour concerning mutual fund holdings belonging to Sri Komaraju (L) Venkata Narasimha Rao with the respondent herein.

In this regard, whoever has objections should appear in the above court in personally or through an advocate duly instructed and able to answer all material questions relating to the matter on Dt: 16-06-2025 at 10:30 A.M. and in default of any such appearance, the matter shall be heard and determined accordingly as per law.

Visakhapatnam
Date: 21-05-2025

**KV Narayana Murthy**
**and**
**V Krishna Mohan**
Advocates
Visakhapatnam,
Cell:96524 47891

# జిఒ 4 సవరించాలని విఆర్ఒల వినతి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విఆర్ఒలు

ప్రజాశక్తి -ఆనందపురం: గ్రామ విఆర్ఓల విధులకు స్పష్టత లేనివిధంగా ప్రభుత్వం ఈనెల 18న జారీ చేసిన జిఒ4ను సవరించాలని విఆర్ఒల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరాజు ఇతర సభ్యులు కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతమున్న గ్రామ, వార్డు, సచివాలయాలను జనాభా ప్రాతిపదికన క్లస్టర్ విధానం తీసుకొచ్చి, రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా మారుస్తూ, ఒక సచివాలయానికి ఒక విఆర్ఒను, మరొక సచివాలయానికి సర్వేయర్‌ను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ4 ద్వారా మార్గదర్శకాలిచ్చిందన్నారు క్లస్టర్ విధానంతోరాష్ట్రంలో 7500 మంది విఆర్ఒలను మిగులు సిబ్బందిగా చూపిన నేపథ్యంలో తమను ఏ శాఖలో, ఏ ప్రాతిపదికన సర్దుబాటు చేస్తారో స్పష్టత లేకపోవడంతో విఆర్ఒలంతా ఆందోళన చెందుతున్నారన్నారు. రేషనైలేజేషన్ ప్రక్రియలో క్లస్టర్ విధానంలో లోపాలను మొదటి నుంచి సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల స్థాయిలో తహసిల్దార్లకు, రెవిన్యూశాఖకు సంబంధం లేకుండా గ్రామ వార్డు సచివాలయాల ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల స్థాయిలో ఎంపిడిఒలు, అర్బన్ లో మున్సిపల్ కమిషనర్లు చేసిన ఈ క్లస్టర్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని వివరించామన్నారు. విఆర్ఒలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అంటున్నారే తప్ప, దానికి అనుగుణంగా చర్యల్లేవన్నారు. క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయాల పరిధిలోని రీసర్వే, పిఒఎల్ఆర్, రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఇతర రెవెన్యూ విధులన్నీ ఒక విఆర్ఒ చేయాల్సిన పరిస్థితుల్లో పనిఒత్తిడి పెరుగుతుందని, అదే సమయంలో ప్రజలకు పూర్తిస్థాయి సేవలు అందవని విన్నవించారు వెంటనే జిఒ4పై పునరాలోచించి, ఒక సచివాలయానికి ఒక విఆర్ఒ ఉండేలాగా నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే 2019 ముందున్న రెవిన్యూ క్లస్టర్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, ప్రధాన కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి వరలక్ష్మి, మండల అధ్యక్షులు డికె. నరసింహులు పాల్గొన్నారు

## ఎల్‌వి.నగర్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే పల్లాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎల్‌వి.నగర్ కమిటీ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 70వ వార్డు ఎల్‌వి నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.. బుధవారం ఎల్‌వినగర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులందరూ గాజువాక ఎమ్మెల్యే పల్లాను ప్రత్యేకంగా కలిసారు. అసోసియేషన్ కొత్త అధ్యక్షుడు అంజిబాబును ఎమ్మెల్యే పల్లాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అభినందించిన పల్లా మాట్లాడుతూ, అసోసియేషన్ సభ్యులందరూ ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. ఎల్‌వి నగర్ ప్రాంతంలోని ప్రధాన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎల్‌వి.నగర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడ్ ఆదిరెడ్డి అంజి, వైస్ ప్రెసిడెంట్ ఎల్ మురళిదేవి, జనరల్ సెక్రెటరీ కెఎస్ నాయుడు , జాయింట్ సెక్రెటరీ సుధాకర్, కోశాధికారి చీకటి లక్ష్మణరావు, నున్నం జోజి, డి.సత్తిరాజు, జివిఎల్ నాయుడు, సిహెచ్ గోపాల్, కమిటీ సభ్యులు చీర భీమ్‌నాయుడు, కెవి.సూరిబాబు డూప్లెక్స్ శ్రీను, ఎస్.చిరంజీవి, జి.కృష్ణ, క్రి నాయుడు, నర్సింగరావు, లంకేశ్వరరావు, పిట్ట సూరిబాబు ఎం చిన్నారావు, మోటూరి కృష్ణ, సతీష్ బాబు, నాయుడు, తమర్ల అప్పారావు, ఆర్‌కె.రాజ్ కుమార్, ఎస్ సురేష్ వెంకటరావు పాల్గొన్నారు.

## వృద్ధుని మూత్ర సమస్యకు 'యూరోలిఫ్ట్' చికిత్స

### రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖ ఏషియన్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహణ

ప్రజాశక్తి-గాజువాక : మూత్రసంబంధిత సమస్యతో బాధపడుతున్న 72ఏళ్ల హైరిస్క్ వృద్ధరోగికి ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారిగా విశాఖపట్నంలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యూ) ఆస్పత్రిలో క్యాథెటర్ అక్కర్లేకుండా యూరోలిఫ్ట్ చికిత్స విజయవంతంగా నిర్వహించారు. చికిత్స చేసిన వైద్యనిపుణుల బృందానికి నేతృత్వం వహించిన సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ జి.రవీంద్రవర్మ మాట్లాడుతూ, గుండెకు బైపాస్ సర్జరీ జరిగి, ఊపిరితిత్తుల సిఒపిడి సమస్యతో బాధపడుతున్న వృద్ధునికి ప్రోస్టేట్ పెద్దది కావడంతో ఆరు నెలలుగా మూత్రం సరిగ్గా విడుదల కాక, క్యాథెటర్ పెట్టించుకున్నాడు. దాన్ని తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఎఐఎన్‌యూ ఆస్పత్రికి రాగా, ఇక్కడ వైద్యబృందం ఈ విప్లవాత్మక చికిత్స చేసింది. స్మృతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ అమిత్ సాప్లే మాట్లాడుతూ, వయోవృద్ధుల మూత్రసమస్యలకు యూరోలిఫ్ట్ అనేది అద్భుతమైన పరిష్కారమన్నారు. అతి తక్కువ సమయంలోనే లక్షణాలు తగ్గిపోతాయన్నారు. యుక్త, మధ్యవయసులో వారికి లైంగిక సమస్యలు కూడా ఉండవన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా ఏఐఎన్‌యూ విశాఖపట్నంలో యూరోలిఫ్ట్ కేసు విజయవంతం కావడంతో అత్యాధునిక యూరాలజీ చికిత్సలు అందుతాయన్న విషయం రుజువైంది. కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ పి.శ్రీధర్ పాల్గొన్నారు.

**యూరోలిఫ్ట్ గురించి..**

అమెరికా ఎఫ్‌డిఎ అనుమతి ఉన్న యూరోలిఫ్ట్ సిస్టం అనేది ప్రోస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ సమస్యను మందులు వాడక్కర్లేకుండా, సంప్రదాయ శస్త్రచికిత్స అవసరం లేకుండా పరిష్కరిస్తుంది. ఇందులో ఇతర ఆప్షన్ల తరహాలో ప్రోస్టేట్ కణజాలాన్ని కత్తిరించాల్సిన అవసరం లేకపోవడంతో రోగులు చాలా త్వరగా కోలుకుంటారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ, పాలిటెక్నిక్ కళాశాలను అనుకుని ఉన్న 11 కెవి ఫీడర్ విభజన, ఇతర పనుల నేపథ్యంలో ఈ నెల 22న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్, ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.జివిఎంసి 3,4 వార్డుల పరిధి తోటవీధి, అప్పికొండ వీధి, బ్యాంక్ కాలనీ, స్మిత్ స్ట్రీట్, జెవి అగ్రహారం, నేరెళ్ళవలసతో పాటు మండలంలోని మూలకుద్దు, రాయిపాలెం, మహాలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు

## జీలుగు విత్తనాలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో జీలుగు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎంఎవి చలం తెలిపారు. రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో వీటిని కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

# చిన్నపాటి వర్షానికే క్రీడా మైదానం కోత

- కూలిన ప్రహరీ నిర్మాణంలో నిర్లక్ష్యం ఫలితం
- బిసి కాలనీలోకి బురద, వరద చేరడంతో ఇబ్బందులు

వర్షపునీటితో కోతకు గురౌతున్న హైస్కూల్ క్రీడా మైదానం

ప్రజాశక్తి -ఆనందపురం : చిన్నపాటి వర్షానికే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడామైదానం కోతకు గురవుతోంది. దీని వల్ల వర్షపునీరు, బురద, మట్టి దిగువనున్న బిసి కాలనీలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతోపాటు యువనేత రవితేజ స్వయంగా పరిశీలించినప్పటికీ, పరిష్కరించలేదని స్థానికులు వాపోతున్నారు.

గతేడాది వర్షాల సీజన్‌లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిపోయింది. దాన్ని పునర్నిర్మాణంగానీ, ప్రత్యామ్నాయ రక్షణ చర్యలుగానీ నేటి వరకు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా, పాఠశాల మైదానంలోకి నీరు ముంచెత్తి కిందకు వెళ్లడంతో మైదానం అంచుల్లో క్రమేణా కోతకు గురవుతోంది. అంతేకాక కోతకు గురైన మైదానం మట్టి, బురద, రాళ్ల రప్పలతోపాటు వర్షపునీరు కిందనున్న బిసి కాలనీలోకి చేరడంతో అక్కడంతా అధ్వానమై కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. క్రీడామైదానం అంచుల నుంచి క్రమేణా కోతకు గురవుతుండడంతో, తక్షణ చర్యలు చేపట్టకుంటే, రానున్న వర్షాల సీజన్‌లో మైదానమంతా గోతులమయం కావడం ఖాయమని స్థానికులు అంటున్నారు. కూలిపోయిన ప్రహరీ పునర్నిర్మాణంతోపాటు, ఇప్పటికే కోతకు గురైన ప్రాంతాన్ని మట్టితో చదును చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. ప్రస్తుతం వేసవి సీజన్‌లో ఈ పనులు చేపట్టకుంటే, వర్షాలు కురిస్తే పనులకు ఆస్కారముండదని ఉపాధ్యాయులతోపాటు, విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు. అధికారులు, నేతలు స్పందించి, తక్షణమే తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి, విశాఖపట్నం సీతంపేట గణేష్‌నగర్ చెందిన గొరుసు నరసింగరావు (52), భార్య రమణమ్మ ఇద్దరూ కలిసి స్కూటీపై భీమిలి మండలం చిప్పాడ పండగకు వెళ్లారు. భార్యను అత్తారింట్లో వదిలి తిరుగు ప్రయాణంలో ఆనందపురం ఫ్లైఓవర్ చెక్ పోస్ట్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుండి వచ్చిన కారు బలంగా ఢీ కొట్టి, నర్సింగరావును కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ప్రమాదంలో తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ, తీవ్రమైన గాయాలతో నర్సింగరావు అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింగరావు వృత్తిరీత్యా ఎలక్ట్రీషన్ పనులు చేస్తుంటారు. మృతునికి భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు భాగ్యశ్రీ ,శ్రీవాణి. కూతుళ్లిద్దరికి వివాహాలు చేశారు. ప్రస్తుతం భార్యాభర్తలు ఉంటున్నారు మృతుడు భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు సీఐ వాసు నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఈ నెల 17న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... మండలంలోని పోతనవలస గ్రామానికి చెందిన సిరికి మనోజ్ (24) ఈనెల 17న మోటార్ బైక్‌పై స్నేహితుడి వివాహానికి వెళ్తున్నాడు. ఆర్‌వై అగ్రహారం గ్రామం శివారులో చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. దానిని మనోజ్ గమనించపోవడంతో బలంగా ఢీకొట్టాడు. దీంతో శరీరంపై బలమైన గాయాలు తగలడంతో వారి కుటుంబ సభ్యులు ఆటోలో మనోజ్‌ను కే కోటపాడు 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజాము 2 గంటలకు మనోజ్ మరణించాడు. తల్లి సిరికి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎ.కోడూరు ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు.

### గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆరిలోవ పోలీసులు బుధవారం అరెస్టు చేసారు. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస రాజీవ్‌నగర్‌కు చెందిన కాకర సుభాష్ చక్రవర్తి, అరకు ప్రాంతానికి చెందిన మజ్జి అప్పన్న విశాఖ వ్యాలీ వైపు వెళ్లే రహదారిలో సుమారు 2.310 కిలోల గంజాయిని తరలిస్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

## జూ పార్కులో వేసవి శిబిరం ప్రారంభం

వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, జివిఎంసి, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, గ్రీన్ పాజ్, యూత్ కన్జర్వేషన్ యాక్షన్ నెట్ వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో జూ పార్కులో ఐదు రోజుల వేసవి శిబిరాన్ని బుధవారం జూ క్యూరేటర్ జి.మంగమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు రోజుల పాటు విద్యార్థులకు వన్యప్రాణుల ప్రపంచాన్ని తెలుసుకోవడానికి, అన్వేషించడానికి, అనుసంధానం చేసుకోవడానికి ఒక అద్భుతమైన అవకాశంగా ఉంటుందన్నారు. జంతువులతో పాటు వాటిని ఆదరిస్తున్న ప్రకృతి పట్ల అవగాహన కలిగించేలా కార్యక్రమాలు రూపొందించినట్టు తెలిపారు. ఈ శిబిరం ద్వారా చిన్నారులకు జంతువులు, వాటి సంరక్షణపై ఆసక్తి కల్పించి, అనుభవాత్మకమైన, పరస్పర చర్యల ద్వారా అవగాహన పెంపొందించే లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు.

# అప్పలరాజు ఆశయసాధనకు కృషి

**• సంస్మరణ సభలో రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్**

సంస్మరణ సభలో మాట్లాడుతున్న ముజఫర్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్** : కష్టజీవుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం శ్రమించిన గుండాల అప్పలరాజు ఆశయసాధనకు ముందుకు సాగాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ పిలుపు నిచ్చారు.బుధవారం సిఐటియు జగదాంబ కార్యాలయంలోఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ అధ్యక్షతన అప్పలరాజు సంస్మరణ సభ జరిగింది. ముందుగా అప్పలరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముజఫర్ మాట్లాడుతూ ఆటో, మోటారు కార్మికుల సమస్యలపై అప్పలరాజు నిరంతరం పోరాడారన్నారు. సంక్షేమబోర్డు కావాలని, జిఒ 21 రద్దు చేయాలని సమ్మె నోటీసుకు ముందురోజే ఆయన గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. పెందుర్తి ప్రాంతంలో సిపిఎం నేతృత్వంలో పేదలకు ఇళ్లస్థలాలకు వారితో జెండాలను పాతించి, సాధించారన్నారు. విశాఖలో ప్రభుత్వ భూములను కార్పొరేట్లకు కాకుండా పేదలకు నివాసస్థలాలుగా పంచివ్వాలన్న పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. పెందుర్తిలో కార్మికులకు అండగా ఉంటూ, సిఐటియు సంఘాన్ని పెట్టిన ఘనత అప్పలరాజు దేనన్నారు.. పేదల రాజ్యం రావాలన్న సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి అప్పలరాజు అని, ఆయన ఆశయ సాధనకు పాటుపడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, మోటార్ ట్రాన్స్పోర్ట్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.జగన్, ఆర్టీసీ యూనియన్ నాయకులు సీత, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## టిడ్కో ఇళ్లను పరిశీలించిన మంత్రి నారాయణ

టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

**ప్రజాశక్తి -గోపాలపట్నం** : విశాఖ పశ్చిమ నియోజకవర్గం 92వ వార్డు పద్మనాభనగర్‌లోని టిడ్కో ఇళ్లను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే గణబాబుతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా 2014లో టిడిపి హయాంలో పేదల కోసం టిడ్కో ఇళ్లను నిర్మించామని, అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి పంపిణీని నిర్లక్ష్యం చేసిందన్నారు. టిడ్కో గృహ సముదాయానికి తమ పార్టీ రంగులు వేయించుకుందని, అయితే రంగులేసిన కాంట్రాక్టర్‌కు కూడాబిల్లులు చెల్లించక మోసచేసిందన్నారు. వచ్చే విజయదశమి నాటికి యాభై శాతం టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

## రెడ్డిపల్లి శాంతినికేతన్ వ్యవస్థాపకులు నారాయణరావు మృతి

సుంకర నారాయణరావు (ఫైల్)

**ప్రజాశక్తి -పద్మనాభం.** మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న శాంతినికేతన విద్యాసంస్థ వ్యవస్థాపకులు సుంకర నారాయణరావు (81) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో కన్నుమూశారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ 1977లో స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన నారాయణరావు, అదే సంవత్సరంలో శాంతినికేతన్ విద్యాలయాన్ని స్థాపించారు. అప్పట్లో ఉత్తరాంధ్రలో రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇదొక్కటే అన్నంత గొప్ప పేరు సంపాదించింది.

విద్యాలయం నిర్వాహకునిగానే కాకుండా రాజకీయాల్లోనూ రాణించిన నారాయణరావు, డిసిసి కార్యదర్శిగా పనిచేశారు. 1991లో రెడ్డిపల్లి గ్రామంలోనే కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించగా, అప్పటి ఎపిసిసి అధ్యక్షుడు ఎం అనంతరాములు హాజరయ్యారు. 1945లో అప్పన్న, ఆదెమ్మ దంపతులకు జన్మించిన నారాయణరావు మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు.

## 170 మందికి ఉచిత కంటి పరీక్షలు

కంటి వైద్యశిబిరంలో మాట్లాడుతున్న సుబ్బారాయుడు

**ప్రజాశక్తి- వేపగుంట** : దక్షిణాసియా ఎల్‌పిజి కంపెనీ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ సహకారంతో బుధవారం కప్పరాడలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ (ఫైనాన్స్) జి. సుబ్బరాయుడు, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వి. రమేష్‌కుమార్ ప్రారంభించిన శిబిరంలో కంపెనీ సిఎస్ఆర్ హెడ్ పిసి. రామ్‌నాథ్, కార్యదర్శి రాకేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగారురాజు తెలిపిన వివరాల ప్రకారం దక్షిణాసియా ఎల్‌పిజి కంపెనీ సౌజన్యంతో నగరంలోని కప్పరాడ, కంచరపాలెం, పెద్దకొత్తూరు, జివిఎంసి 47వవార్డు రాంజీ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో నెలరోజులపాటు ఉచిత కంటి శిబిరాలను నిర్వహించి రోగులకు కంటిపరీక్షతోపాటు కంటిఅద్దాలు, మందులు అందజేస్తారన్నారు. కంటి ఆపరేషన్‌కు శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించి చేస్తామన్నారు. తొలిరోజున కప్పరాడలో 170మందికి కంటిపరీక్షలు చేశారు.

## 28న మోడల్ డిఎస్‌సిని జయప్రదం చేయండి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నేతలు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్** : యుటిఎఫ్, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28న జరగనున్న మోడల్ డిఎస్‌సిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.ఆర్ అంబేద్కర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్ రాజు, కె. సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, యుటిఎఫ్, డివైఎఫ్ఐ పోరాటంతో మెగా డిఎస్‌సి సాకారమైందన్నారు.

ఈ నేపథ్యంలో ఉద్యోగార్థులకు దీనిపై అవగాహనకు విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు రూపొందించిన నమూనా ప్రశ్నాపత్రంతో ఎస్‌జిటి అభ్యర్థులకు మోడల్ డిఎస్‌సి నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రూ.50ఫీజుతో తమ పేర్లను నమోదు చేసుకుని సద్వినియోగ పరచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఇతర, వివరాలకు 93989 70538, 63022 72862 ఫోను నెంబర్లక సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఉమా శైలజ పాల్గొన్నారు.

## విశాఖ నగరాభివృద్ధికి కృషి : మేయర్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా

**ప్రజాశక్తి- సీతమ్మధార** : కూటమి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సిఎం చంద్రబాబు నాయకత్వంలో విశాఖ నగర అభివృద్ధికి కృషి చేయనున్నట్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జివిఎంసి ఐదోజోన్ 50, 51 వార్డులలో పలు అభివృద్ధి పనులకు ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, సంబంధితవార్డుల కార్పొరేటర్లు వావిలిపల్లి ప్రసాదు, రెయ్యి వెంకటరమణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ 50వ వార్డు మురళి నగర్ వాకర్స్ పార్క్ అభివృద్ధి, మాధవధార సాయిరాం నగర్ కొండవాలు ప్రాంతాలలో రూ.58.90 లక్షల జివిఎంసి నిధులతో సిసి రోడ్లు, కాలువలు, 51వ వార్డు భీమ్ నగర్‌లో రూ.16.20 లక్షల జివింఎసి నిధులతో సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. వార్డులలో ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, నియోజవకర్గంలో వార్డుల అభివృద్ధితోపాటు ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, డిఇఇ భరణి, ఎఇఇలు సతీష్, రత్నాకర్, పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సబ్బుల అందజేత

పారిశుధ్య కార్మికులకు సబ్బులు అందజేస్తున్న టిడిపి నేతలు

**ప్రజాశక్తి - ఆరిలోవ** : జివిఎంసి 13వ వార్డులోని పారిశుధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత సూచనల మేరకు వార్డు టిడిపి అధ్యక్షుడు పొత్రకండ ధర్మారావు బుధవారం సబ్బులు, కొబ్బరినూనె, ఇతర వస్తువులు అందజేశారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు, వార్డు టిడిపి నాయకులు కెల్ల సత్యనారాయణ, మజ్జి రమణి, యల్లమిల్లి సురేష్ పాల్గొన్నారు.

## వైసిపి తూర్పు సమన్వయకర్తగా మొల్లి

మొల్లి అప్పారావు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ** : విశాఖ తూర్పు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్తగా సీనియర్ నాయకుడు మొల్లి అప్పారావు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. నియోజకవర్గ పరిధి మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన అప్పారావు పార్టీ ఆవిర్భావం నుంచి నుంచి సేవలు అందిస్తున్నారు. ఆయన భార్య మొల్లి లక్ష్మి 16వ వార్డు కార్పొరేటర్‌గా వ్యవహరిస్తున్నారు.అప్పారావును తూర్పు సమన్వయకర్తగా నియమించడంపై పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**హర్షం వ్యక్తం చేసిన యాదవ నేతలు**

తూర్పు సమన్వయకర్తగా మొల్లి అప్పారావు, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఉరుకూటి రామ చంద్రరావు (చందు)లను నియమించడంపై యాదవ సామాజిక వర్గం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉరుకూటి చందు మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించిన శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు, నగర అధ్యక్షులు కెకె.రాజు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీతల గోవింద్, పీతల శ్రీనివాస్, మువ్వల సంతోష్ , కొయ్య చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## 44 మందికి కళ్లద్దాల పంపిణీ

కళ్ళద్దాలు అందుకున్న వారితో అసోసియేషన్ ప్రతినిధులు

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : స్థానిక సన్ స్కూల్‌లో ఇటీవల నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వైద్యుల పరీక్షల్లో దృష్టిలోపమున్నట్లు గుర్తించిన 44 మందికి బుధవారం కళ్ళద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు.కార్యక్రమంలో నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె శ్రీనివాస్, సభ్యులు వై శ్రీనివాసరెడ్డి, పి అరుణ్ కుమార్ పాల్గొన్నారు

## సింహాచల దేవస్థానం ప్రధానార్చకులు రమణాచార్యులు గుండెపోటుతో మృతి



రమణాచార్యులు (ఫైల్)

**ప్రజాశక్తి- పెందుర్తి** :సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవాలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు (58) బుధవారం గుండెపోటుతో మరణించారు. రెండు రోజుల కిందట అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన ఆయన, బుధవారం తెల్లవారు జామున మృత్యువాత పడ్డారు. మూడున్నర దశాబ్దాల పాటు సింహాచలేశుని పూజాది కైంకర్యాలలో విశేష సేవలందించిన రమణాచార్యులు అకాల మరణం పట్ల దేవస్థానం ఉద్యోగులతో పాటు గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. 98వ వార్డు పద్మావతి నగర్‌లోని రమణాచార్యుల ఇంటికి పలువురు వెళ్ళి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. రమణాచార్యులకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రమణాచార్యుల మరణం తీరని లోటని ఆలయ వైదిక పెద్దలు, అధికారులు అన్నారు. సింహాచలం దేవస్థానం ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఎఇఒలు ఎన్ ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాస్, మాజీ ధర్మకర్తలు గంట్ల శ్రీనుబాబు, సూరిబాబు, కప్పస్తంభంనాయుడు, ప్రసాద్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. రమణాచార్యులు సేవలను కొనియాడారు. అడవివరం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు..

# కూటమిలో అంతర్గత పోరు

- నిష్పత్తి ప్రకారం పనులు కేటాయించడం లేదని టిడిపి నేతల ఆరోపణ
- పార్టీ కేడర్‌కు అధికార యంత్రాంగం విలువివ్వడం లేదని ఆవేదన
- మినీ మహానాడు వేదికగా బోరుమన్న కేడర్

**ప్రజాశక్తి-యలమంచిలి**

యలమంచిలి నియోజకవర్గంలో కూటమి పార్టీల మధ్య అంతర్గత, ఆధిపత్య పోరు కొనసాగుతోందని స్థానిక గురప్ప కల్యాణ మండపంలో మంగళవారం టిడిపి మినీ మహానాడు జరిగిన తీరును పరిశీలిస్తే ఇట్టే అర్థమవుతోంది. "నియోజకవర్గంలో టిడిపిని అంతమొందించేందుకు బలమైన రాజకీయ శక్తులు కలిసి పనిచేస్తున్నాయని, ఆ శక్తుల్ని గట్టిగా ఎదుర్కోవాలని" "పార్టీ కేడర్‌కు విలువివ్వని అధికార యంత్రాంగాన్ని ఇక్కడ నుండి సాగనంపాలని" మినీ మహానాడులో తీర్మానాలు చేశారంటే టిడిపి కేడర్ ఆవేదన ఏ స్థాయిలో ఉందో వెల్లడవుతోంది.

2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి సీట్లు సర్దుబాటులో భాగంగా యలమంచిలి టికెట్ జనసేనకు దక్కింది. దీనిపై నాడు తెలుగుదేశం నాయకత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినా పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు టిడిపి కేడర్ మద్దతు ప్రకటించింది. టిడిపి ఓట్లు సంపూర్ణంగా పడడంతోనే సుందరపు విజయ్‌కుమార్ 50వేలు మెజార్టీతో గెలిచారని టిడిపి శ్రేణులు చెబుతున్నాయి. అయితే విజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలిచాక తెలుగుదేశం పార్టీని పట్టించుకోవడం మానేశారని ఆ పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రధానంగా కూటమి ప్రభుత్వంలో పార్టీల వారీగా నిష్పత్తి ప్రకారం పనులు, నిధులు కేటాయింపు విషయంలో ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడితో వ్యవహరిస్తూ తాము సూచించిన పనులను పట్టించుకోవడం లేదని తెలుగుదేశం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ మినీ మహానాడులో మరో తీర్మానం చేశారు. నియోజకవర్గంలో గ్రామస్థాయి విఆర్‌ఓల నుంచి కలెక్టర్ వరకు అధికార యంత్రాంగం, కానిస్టేబుల్ నుండి ఎస్‌పి వరకు పోలీసు యంత్రాంగం సైతం తమకు విలువివ్వడం లేదని కార్యకర్తలు నాయకుల్ని నిలదీశారు. అయినా వాటికి సమాధానివ్వకుండా దాటవేసే ప్రయత్నం టిడిపి నాయకత్వం చేసింది.

మరో వైపు నియోజకవర్గం పరిధిలో 200 పైచిలుకు కంపెనీలున్నా వాటిలో కాంట్రాక్టు పనులన్నీ ఇప్పటికీ వైసీపీ నేతల బినామీలే చక్కబెడుతున్నారని, వారికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అండగా ఉంటున్నారని, ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే ఆర్థిక ప్రయోజనాలు దాగి ఉన్నాయని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు.

దీనికి తోడు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు గ్రామ, మండల స్థాయి టిడిపి, బిజెపి మెజార్టీ నాయకులు షరతులు లేని సాష్టాంగ దాసోహ సోపానం కొనసాగుతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ పెద్దలకు ఎమ్మెల్యేపై ఫిర్యాదులు చేయడం తప్ప సొంత కార్యకర్తలను కాపాడుకోలేని స్థితిలో తెలుగుదేశం నాయకత్వం ఉండగా, తనపై బాహాటంగా ఫిర్యాదులున్నా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఎక్కడా తగ్గకుండా అధికారులను తన చెప్పుచేతల్లో ఉంచుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## చెరువులను తలపిస్తున్న రహదారులు

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట**

కొద్దిపాటి వర్షానికే మండలంలోని పలు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. బుధవారం మండలంలోని రాజాం, తురకలపూడి, సీతయ్యపేట, బుచ్చయ్యపేట, వడ్డాది తదితర గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో రాజాం జంక్షన్ నుండి తట్టబంద జంక్షన్ వరకు వెళ్లే రోడ్డులో రాజాం, తైపురం, చిట్టియ్యపాలెం, తురకలపూడి తదితర గ్రామాల వద్ద రహదారిపై ఉన్న పెద్ద పెద్ద గోతుల్లో నీళ్లచేరడంతో చిన్నపాటి చెరువులుగా దర్శనమిచ్చాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడ్డాది జంక్షన్లో సైతం గొంతులో నిలిచిపోయిన నీటితో వాహనదారుల అవస్థలు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి ఇలా ఉంటే వచ్చే వర్షాకాలంతో రోడ్ల పరిస్థితి ఏమిటని పలువురు వాపోతున్నారు. గోతుల్లో నీరు చేరడంతో పలుమార్లు వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కనీసం గుంతలనైనా పుడ్చాలని పలువురు కోరుకుంటున్నారు.

వడ్డాడి సమీపంలో రోడ్డుపై గోతుల్లో చేరిన వర్షపు నీరు

చెరువును తలపిస్తున్న రాజాం-తట్టబంద రోడ్డు

## ఇంటిపై పిడుగు - దెబ్బతిన్న గోడ, పిల్లర్

**ప్రజాశక్తి-కశింకోట :** మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో గ్రామానికి చెందిన నూతిగట్టు మల్లేశ్వరరావు ఇంటిపై పిడుగు పడింది. దీంతో గోడ, పిల్లర్ దెబ్బతిన్నాయి. ఇంటిలో విద్యుత్ వైర్లు, ఇన్వెటర్ కాలిపోయాయి. ఆ సమయంలో చుట్టుపక్కల ఇళ్ల వారికి కరెంటు షాక్ కొట్టినట్లు అయింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇంటిపై పిడుగు పండడంతో దెబ్బతిన్న గోడ, పిల్లరు (సర్కిల్‌లో)

## వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పోలీస్ సేవలు

**- వాట్సప్ వాట్సాప్ నెంబర్**
**95523 00009**
**- జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా**

మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

**ప్రజాశక్తి-అనకాపల్లి :** "ఇకపై మీ ఎఫ్‌ఐఆర్‌ను వేగంగా, సులభంగా డిజిటల్ రూపంలో పొందవచ్చు. ఇక పోలీస్ స్టేషన్‌కు వెళ్లే అవసరం లేదు. మీ మొబైల్ నుండే పోలీస్ సేవలను పొందవచ్చు" అని ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా "ప్రజల సేవలో స్మార్ట్ పోలీసింగ్ ఇప్పుడు వాట్సాప్‌లోనే" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. ఈ కొత్త డిజిటల్ సేవల ద్వారా ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా సేవలు అందించడమే లక్ష్యమన్నారు.

**పోలీస్ సేవలు పొందడం ఎలా పొందాలి**

స్టెప్1 : మీ మొబైల్ నుంచి 95523 00009 నెంబర్‌కు 'Hi' అని వాట్సాప్‌లో మెసేజ్ చేయండి.

స్టెప్ 2 : వచ్చిన మెనూ నుంచి "Citizen Services" లేదా పౌర సేవలు ఎంపిక చేయండి.

స్టెప్ 3 : అందుబాటులో ఉన్న సేవల నుంచి మీరు అవసరమైన సేవను ఎంచుకోండి. ఉదాహరణకు : ఎఫ్‌ఐఆర్ డౌన్లోడ్, ఎఫ్‌ఐఆర్ స్థితి తెలుసుకోవడం.

స్టెప్ 4 : అవసరమైన వివరాలు నమోదు చేసి సమర్పించండి. వెంటనే మీ మొబైల్‌ఫోన్‌లో ఎఫ్‌ఐఆర్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు లేదా దాని స్థితి తెలుసుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకొని లబ్ధి పొందాలని ఎస్‌పి కోరారు. అన్ని పోలీస్ స్టేషన్లలో సంబంధిత సమాచారం, పాంప్లెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఎంఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

## మిడ్డేమీల్స్ బిల్లులు విడుదల చేయాలని ధర్నా

**ప్రజాశక్తి-చోడవరం**

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గత జనవరి నుండి చెల్లించాలని బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ సకాలంలో బిల్లులు రాకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది పది తరగతులకు సంబంధించి డిసెంబర్ నెల నుండి బిల్లులు రాలేదని, ఐదు నెలలు బిల్లులు వేతనాలు రాకపోతే మధ్యాహ్న భోజన కార్మికులు ఎలా వంట చేసి పెట్టాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతినెల 15వ తేదీకి బిల్లులు వచ్చేవని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెలలు తరబడి వేతనాలు కానీ, బిల్లులు గాని ఇవ్వడం లేదని విమర్శించారు. మౌలిక వసతులు, కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కనీస వేతనాలు వంటివి లేకపోయినా ఇదే ఉపాధిని నమ్ముకుని పనిచేస్తున్న కార్మికులను అప్పుల ఊబిలోకి ప్రభుత్వం నెట్టేయడం దారుణమన్నారు. రకరకాల మెనూల పేర్లతో కార్మికులపై భారాన్ని పెంచుతున్న ప్రభుత్వం సకాలంలో బిల్లులు ఇవ్వడంలోని విఫలమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఐదు నెలల బకాయి బిల్లులు, వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి లక్ష్మి నారాయణమ్మ, ఎర్రయ్యమ్మ, బి.లక్ష్మి, దేవుడమ్మ, సత్యవతి, దేవి, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు

## 25 వరకు 'అన్నదాత సుఖీభవ' పొడిగింపు

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు స్థానిక వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ఈ పథకం కోసం రైతులంతా తమ భూమి వివరాలతో ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. బుధవారం కే కోటపాడు రైతు సేవా కేంద్రంలో వివరాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెవిన్యూ రికార్డుల ప్రకారం ఆన్లైన్లో నమోదు చేయబడిన రైతుల భూముల వివరాలు సరైనవా అన్నది పరిశీలిస్తారని తెలిపారు. ప్రతి రైతు తన భూమికి సంబంధించి 1బి, ఆధార్, రేషన్ కార్డ్, బ్యాంక్ పాస్ పుస్తకం రైతు సేవా కేంద్రంలో అందజేయాలని కోరారు.

## జవాన్‌కు సత్కారం

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట :** జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాజాం గ్రామంలో ఆర్మీ జవాన్ నడిపల్లి అశోక్‌ను ఆకుల ఫౌండేషన్, గ్రామస్తుల సంయుక్తాధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానం చేశారు. గ్రామానికి చెందిన అశోక్ పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో విధుల్లో వున్నాడు జమ్మూ, కాశ్మీర్, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. సెలవులపై గ్రామానికి బుధవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా అండమాన్ దుర్గ ఆధ్వర్యంలో ఆకుల నాగేశ్వరావు తదితరులు సన్మానం చేసి అభినందనలు తెలిపారు.

ఆర్మీ జవాన్ అశోక్‌ను సత్కరిస్తున్న రాజాం గ్రామస్తులు

లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

## ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కశింకోట

వెదురుపర్తి గ్రామంలో హౌసింగ్ కాలనీలో లబ్దిదారునితో ఇళ్ల నిర్మాణం తొందరగా పూర్తిచేయాలని కశింకోట హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన వెదురుపర్తి హౌసింగ్ కాలనీని సందర్శించారు. ఇళ్ల నిర్మాణం ఏ దశలో వున్నాయో పరశీలించార్ను. ఈ కార్యక్రమరో ఎంపిడిఓ రవికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ్ కుమార్, కూటమి నాయకులు సన్యాసిరావు పాల్గొన్నారు.

## భారత సైనికులకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి-సబ్బవరం

భారత సైనికులకు మద్దతుగా టిడిపి పెందుర్తి నియోజకవర్గ ఇంచార్జి గండి బాబ్జి ఆధ్వర్యంలో సబ్బవరంలో తిరంగ ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఎన్టీఆర్ జంక్షన్ నుండి ఇరువాడ జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, గండి బాబ్జి మాట్లాడుతూ భారత సైనికులకు మద్దతు పలికి దేశ సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గండి వంశీ దీప్, గండి ముత్యాల నాయుడు, బర్నికాన సాయినాథరావు, గండి దేముడు, కోటాన అప్పారావు, పీబివిఎస్ఎన్ రాజు, రెడ్డి నారాయణరావు, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాల నాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో బుధవారం యాదవ సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గ ఎన్నిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బరిణికాన సాయినాథరావు (బాబురావు) ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా కోన సోమేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా చట్టి తాతారావు, మొల్లి కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా నమ్మి అప్పారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా రోమల వెంకటేష్, కార్యదర్శులుగా శివన్నారాయణ, ఉప్పులి దుర్గారావు, కోన రాము, జాయింట్ సెక్రటరీగా సారిపల్లి నాగరాజు, కోశాధికారిగా ఉప్పులి రాజు, ఉపకోశాధికారిగా నెక్కెళ్ళ సన్యాసినాయుడు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, పల్లకృష్ణ, ఈపు అప్పలరాజు, పల్ల సన్యాసిరావు, పి.రాంబాబు, పల్ల శ్రీరాములు, గజ్జి నర్సింగరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-చోడవరం

అన్న కాంటీన్ ఏర్పాటు చేయడానికి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పంచాయతీ స్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు బుధవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సర్వే చేయించి అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. చోడవరంలో పేదలకు మంచి భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, పంచాయతీ ఈవో నారాయణరావు, వార్డు మెంబర్ తనవరపు శ్రీను, ఎంపీటీసీ నాయుడు, మండల సర్వేయర్ దినేష్, పార్థరాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

# పాటలు, సాహిత్యం సమాజాన్ని తట్టిలేపాలి

- ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ
- ఘనంగా సిరివెన్నెల సీతారామ శాస్త్రి 70వ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

రచయితలు రాసే పాటలు, సాహిత్యం సమాజాన్ని తట్టి లేపేలా ఉండాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక సత్యాస్ లక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో సిరివెన్నెల సీతారామ శాస్త్రి 70వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధులుగా ప్రముఖ సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి, రచనా రాజహంస, ఎర్రాప్రగడ రామకృష్ణ, యర్రంశెట్టి సత్యారావు మాస్టర్, సీతారామ శాస్త్రి సోదరులు శ్రీరామశాస్త్రి, వేంకట శాస్త్రి, సీతారామ శాస్త్రి సతీమణి పద్మావతి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. వక్తలు సీతారామ శాస్త్రి ప్రస్థానం, ప్రయాణం, సాధించిన విజయాలు, తెలుగు సాహిత్యంపై ఆయనకున్న మక్కువ కోసం వివరించారు. ఆయన జయంతి మహోత్సవాన్ని ఇంత ఘనంగా ఏర్పాటు చేసిన కొణతాల రామకృష్ణ ఔన్నాత్యాన్ని, ఆలోచనలను కీర్తించారు. అనంతరం కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా శ్రీరామశాస్త్రి రచించిన మనిషికి మరమ్మతు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ సీతారామ శాస్త్రి గొప్ప రచయితయే కాకుండా గొప్ప దేశభక్తి గల వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన రాసిన పాటలు, సాహిత్యం సమాజాన్ని తట్టి లేపే విధంగా ఉంటాయని, అలాంటి వ్యక్తి అనకాపల్లిలో పుట్టడం గర్వకారణమన్నారు. సిరివెన్నెల కళాపీఠం ఏర్పాటు చేసి వచ్చే ఏడాది నాటికీ "తానా" సభ్యులతో సంయుక్తంగా అనకాపల్లిలో సీతారామ శాస్త్రి విగ్రహ ఏర్పాటు కూడా చేస్తామని ప్రకటించారు. అనంతరం రామజోగయ్య శాస్త్రికి సిరివెన్నెల సీతారామ శాస్త్రి స్మారక పురస్కారం అందించి సత్కరించారు. వచ్చిన అతిధులందరికి జ్ఞాపికలు అందచేశారు. ఈ సందర్భంగా గాయకులు ఆలపించిన సీతారామ శాస్త్రి పాటలు, పౌర్ణమి చిత్రంలో భరత వేదమున పాటకు డాన్స్ మాస్టర్ సురేష్ సారధ్యంలో నాట్యప్రదర్శన ప్రేక్షకులను అలరించాయి.

రామజోగయ్యశాస్త్రికి సిరివెన్నెల స్మారక పురస్కారాన్ని అందిస్తున్న దృశ్యం

# యుక్తధార యాప్‌తో ఉపాధి హామీకి తూట్లు

## ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకన్న

**ప్రజాశక్తి-దేవరాపల్లి :** కేంద్రంలో మోడీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యుక్తధార మొబైల్ యాప్ ద్వారా జాతీయ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2005లో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం ద్వారా పనులన్నీ రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే నడిచేవని తెలిపారు. గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలంటే ఆ గ్రామ పంచాయతీ సామూహికంగా ఒక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులను గుర్తించే వెసులుబాటు ఉండేదని పేర్కొన్నారు. కాని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఈ మొబైల్ యాప్ వల్ల ఉపాధి హామీ పనుల అజమాయిషీ మొత్తం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లిపోతాయని తెలిపారు. ఇప్పటికే ఈ యాప్ వినియోగం తొలి దశలో జిల్లా వ్యాప్తంగా మండలానికో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేస్తున్నారని, రెండో దశలో అన్ని గ్రామాల్లోనూ దీనిని అమలు చేస్తారని చెప్పారు. ఉపాధి హామీ చట్టం ద్వారా రాష్ట్రంలో మోడల్ గ్రామాలను ఎంచుకొని, కేటాయించే మెటీరియల్ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర భవన నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు. ఈ యాప్ ద్వారా కేంద్ర పర్యవేక్షణ మొదలైతే భవిష్యత్తులో ఈ పనులన్నీ చేసే వీలుండదని పేర్కొన్నారు. అవినీతిని నిర్మూలించాలంటే దానికి తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలి తప్ప పథకాన్ని కేంద్రం ఆధీనంలోకి తీసుకోవడం సరికాదని హితవుపలికారు. దీని వల్ల పనుల కల్పన పూర్తిగా తగ్గిపోతాయని, ఈ చట్టంపై రాష్ట్రాలు తమ హక్కులను పూర్తిగా కోల్పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా బిల్లులు చెల్లింపులు చేయకుండా ఇబ్బంది పెడుతున్న కేంద్రం ఇప్పుడు కొత్త మెలుక పెట్టి ఈ పథకం ఉసురు తీయాలని చూస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పది వారాలుగా బకాయి ఉన్న కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

## టిడిపి జిల్లా అధ్యక్షులు తాతయ్యబాబు

మినీ మహానాడులో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు తాతయ్యబాబు

**ప్రజాశక్తి-సబ్బవరం :** అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. మండలంలోని ఇరువాడ దరి ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం పెందుర్తి నియోజకవర్గం మినీ మహానాడు జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపునిస్తుందని, వారి సమస్యలను పరిష్కరిస్తుందని చెప్పారు. టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్చార్జ్ గండి బాబ్జి మాట్లాడుతూ మినీ మహానాడులో ప్రజల నుండి వచ్చిన సమస్యలను తీర్మానం చేసి జిల్లా పార్టీ అధ్యక్షుడు ద్వారా మహానాడుకు పంపించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు లొడగల కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, సేనాపతి వసంత శంకర్రావు, మొల్లి ముత్యాల నాయుడు, నాయకులు గండి వంశీదీప్, భరణికాన బాబురావు, గండి దేముడు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, పిబివిఎస్ఎన్ రాజు, కోటాన అప్పారావు, రెడ్డి నారాయణరావు, మాసవరపు అప్పలనాయుడు, కోరాడ శ్రీనివాసరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మినీ మహానాడును విజయవంతం చేయాలి

**అనకాపల్లి :** పాయకరావుపేట నియోజకవర్గం అడ్డు రోడ్డు జంక్షన్‌లో గురువారం జరిగే మినీ మహానాడును విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహానాడుకు ముఖ్యఅతిధులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర హాజరవుతారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

# టిడిపి మండల అధ్యక్ష పదవికి డిమాండ్

## ప్రయత్నాల్లో ఆశావహులు

**ప్రజాశక్తి - బుచ్చయ్యపేట :** బుచ్చయ్యపేట మండల టిడిపి అధ్యక్ష పదవికి ఆశావహులు అధికంగా ఉండడంతో అధిష్టానానికి తలనొప్పుగా మారిందని పార్టీ శ్రేణుల లోలోపల గుసగుసలు వినబడుతున్నాయి. ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరుగు మహానాడుకు ముందుగానే గ్రామస్థాయి నుండి మండల జిల్లాస్థాయి కమిటీలు పూర్తి చేయాలని పార్టీ అధిష్టానం సూచన మేరకు మండలంలోని సుమారు అన్ని గ్రామాల్లోనూ గ్రామ కమిటీ ఎన్నికలు పూర్తయ్యాయి. మండల కమిటీ అధ్యక్ష పదవికి ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. గతంలో అధ్యక్షునిగా గోకివాడ కోటేశ్వరరావు ఐదు పర్యాయాలు పని చేయడంతో మార్పు తప్పదని సంకేతాలు అధిష్టానం నుండి వచ్చాయి. దీంతో ఆశావహులు తమ తమ ప్రయత్నాలను చేసుకుంటున్నారు. 2021 ఎన్నికల్లో జడ్పిటిసిగా పోటీ చేసిన తురకలపూడి పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోరుకొండ రవికుమార్, ఆర్.భీమవరం మాజీ సర్పంచ్ మలిరెడ్డి బుజ్జి, మాజీ జెడ్పిటిసి వియ్యపు అప్పారావు, ఎల్బీ పురం మాజీ సర్పంచ్ తమరాన దాసు అధ్యక్ష రేసులో ఉన్నారు. వైసిపి హయాంలో అనేక గ్రామాల్లో కొంతమంది నాయకులు ఆర్థికంగా రాజకీయంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాడు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన కొంతమంది నాయకులు సైతం అధిష్టానం తమ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తుందని భావిస్తున్నారు. ప్రతిపక్ష సమయంలో క్లస్టర్ ఇన్చార్జిలుగా, బూత్ ఇన్చార్జులుగా అనేకమంది అవిశ్రాంతంగా పని చేశారు. వారు సైతం తమ అభ్యర్థిత్వాన్ని మండల కమిటీ ఎంపికలో పరిశీలించాలని కోరుతున్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల పార్టీ అధ్యక్ష పదవికి డిమాండ్ ఎక్కువైంది. అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతోందోనని టిడిపి క్యాడర్ ఎదురుచూస్తుంది.

### ఉప కమిటీలకు కూడా డిమాండ్

మండల అధ్యక్ష పదవితో పాటు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు, మండల తెలుగు యువత, మండల తెలుగు రైతు కమిటీల పదవులకు కూడా డిమాండ్ ఎక్కువగా ఉంది. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారికి కట్టబెట్టాలని తెదేపా శ్రేణులు ఆశిస్తున్నాయి. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తటస్థంగా ఉండి పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మెహర్బానీ చూపించే నాయకులకు ప్రాధాన్యతనిస్తారా? లేదంటే పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశం కల్పిస్తారా? అనేది వేచిచూడాలి.

## పగటి కలలు కంటున్న మాజీ సిఎం జగన్

**ప్రజాశక్తి-అనకాపల్లి :** మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటూ తమ కార్యకర్తలను మోసగిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుద్ధ నాగ జగదీష్ విమర్శించారు. రాష్ట్ర ప్రజలు జగన్ రెడ్డిని తిరస్కరించినా ఆయనలో మార్పు రాలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పుల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చట్ట పరమైన చర్యలకు సహించలేని జగన్ రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, తిరిగి మూడేళ్లలో అధికారం చేపడతామని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

# పుస్తకాలు చదవడంతో విజ్ఞానం

## - కొనసాగిన వేసవి శిబిరాలు

చీడికాడలో అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్

**ప్రజాశక్తి-చీడికాడ:** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలం కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు చదివించారు.వాటితోపాటు రోజువారి దినపత్రికలను చదివించారు. దిన పత్రికలతో రోజువారి సమాచారాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులకు కథలతో ఆలోచన శక్తి పెరుగుతుందని లైబ్రేరియన్ జోగేశ్వరి తెలియజేశారు.

**నర్సీపట్నం టౌన్:**పుస్తకం ఒక విజ్ఞాన గని అని విశ్రాంత ఉపాధ్యాయులు ప్రభాకర్ తెలియజేశారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ, పుస్తకం ఒక విజ్ఞాన గని అని విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులతో మాస్ రీడింగ్ చేయించారు. పుస్తకాలతో ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించి ఆంగ్ల అక్షరాలపై ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయధికారిణి పి దమయంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

**నక్కపల్లి:** మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం గణిత ఉపాధ్యాయులు నడిగట్ల సాంబశివరావు విద్యార్థులకు గణితం పై అవగాహన కల్పించారు. సులభమైన రీతిలో లెక్కలను బోధించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత గ్రంథాలయాన్ని సందర్శించారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.
ఫోటోః విద్యార్థులు తో మాటలుడుతున్న గ్రంథాలయ అధికారి జగన్

**కశింకోట :** మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా బుధవారం బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జగన్ రామాయణంలోని విశేషాల గురించి చెప్పారు. కార్యక్రమం పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్

**ములగాడ** : శాస్త్ర,సాంకేతిక రంగాలలో భారతదేశాన్ని అభివృద్ధి చేయడానికి మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చేసిన సేవలు నిరూపమానమైనవని మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణా శిబిరంలో రాజీవ్‌వర్థంతిని నిర్వహించారు. యువజనుల అభివృద్ధికి, స్థానిక సంస్థల ప్రగతికి, కంప్యూటర్ రంగ పురోభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషిని కొనియాడరు. జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి, ఎన్‌సిసి వాలంటీర్లు సునీత, జ్యోతిర్మయి ఆధ్వర్యంలో బాలలకు పాటల పోటీలను నిర్వహించారు.

# రాజీవ్ గాంధీకి ఘన నివాళి

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** నర్సీపట్నంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నంగిన రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అబీడ్ సెంటర్లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అనకాపల్లి జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ మాట్లాడుతూ, సాంకేతికకు రాజీవ్ గాంధీ ఆద్యుడని తెలిపారు. భారతదేశానికి ప్రధానిగా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముత్యాలు సాంబశివరావు, రాజాం రాజు, అధికారి చిన్నిలు , నాయుడు పాల్గొన్నారు.

**మాడుగుల :**మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పడాల కొండలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగల రావిచెట్టు జంక్షన్ కూడలి వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తు చేస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యేసు రాజు, పుట్ట అమరయ్య శెట్టి గుప్తా, ఊడి అప్పారావు కోరుకొండ సూర్య పాల్గొన్నారు.

నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

## 'వెంకన్న'ఆభరణాలకు రశీదులు ఇవ్వలేదని ఫిర్యాదు

**ప్రజాశక్తి -నక్కపల్లి:** ఉపమాక వెంకన్నకు మొక్కుకున్న సందర్భంగా బంగారు ఆభరణాలను అర్చకులకు అందజేశామని, నేటి వరకు రసీదులు ఇవ్వలేదని ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావుకు బుధవారం స్థానిక నాయకులతో కలిసి దాతలు ఫిర్యాదు చేశారు.ఎస్ రాయవరం మండలం, వమ్మవరం గ్రామానికి చెందిన శ్రీకాకుళపు బంగారు శెట్టి స్వామివారికి తులం బంగారం తో తయారుచేసిన శతమానాన్ని మార్చి 9వ తేదీన ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులకు అందజేయడం జరిగిందని, నేటి వరకు రసీదు ఇవ్వలేదని దాత తరుపున స్థానిక నాయకులు ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావుకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.ఉపమాక గ్రామానికి చెందిన కర్రి గురాజీ మాట్లాడుతూ, స్వామివారికి పావు తులం బంగారం ఉంగరాన్ని మార్చి 10వ తేదీన ఆలయ అర్చకుడు సాయి గోపికు ఇవ్వడం జరిగిందని, నేటి వరకు రసీదు ఇవ్వలేదని ఫిర్యాదు పత్రాన్ని అందజేశాడు. ఆలయ ఇన్ స్పెక్టర్ మాట్లాడారు. ఆలయ అర్చకులకు దాతలు ఇచ్చిన బంగారం ఆభరణాల గురించి నేటి వరకు తనకు తెలియదని, అర్చకులు కూడా తన దృష్టికి తీసుకురాలేదన్నారు.ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు మాట్లాడుతూ దాతలు ఇచ్చిన బంగారు ఆభరణాలకు నేటి వరకు రసీదులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త కక్కిరాల శ్రీను, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, టిడిపి నాయకులు కొప్పిశెట్టి వాసు, తోలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు పత్రంతో దాతలు

ఈ విషయమై ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు మాట్లాడుతూ, దాతలు ఇచ్చిన రెండు ఆభరణాలను ఆలయంలో భద్రపరిచామని, తిరుమల తిరుపతి దేవస్థానం కు చెందిన ఇన్వెంటరీ టీం ఆలయానికి వచ్చిన తర్వాత దాతలకు రసీదు ఇవ్వడం జరుగుతుందన్నారు.

# మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి- మాడుగుల:**మాడుగుల మోద కొండమ్మ అమ్మవారి నూతన ఉత్సవ కమిటీ ఎన్నిక బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికలో మాడుగుల పంచాయతీ పరిధిలో గల 16 వార్డులకు సంబంధించి ఒక్కో వార్డ్ నుంచి ఒక్కొక్కరి చొప్పున దరఖాస్తు స్వీకరించారు. దీంతో, 16 వార్డుల నుంచి 119 దరఖాస్తులు కమిటీ సభ్యులకు అందించారు. బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఒక్కో వాటికి సంబంధించి వచ్చిన దరఖాస్తులను డ్రా పద్ధతిలో తీసి ఎంపిక చేశారు. ఈ ఎన్నికలో ఒకటవ వార్డు నుంచి గండి మణికంఠ, 2వ వార్డు నుంచి దర్మిశెట్టి త్రిమూర్తులు, 3నుంచి పొలిమేర నాయుడు, ఎలిశెట్టి గణేష్, పుట్టా దినేష్, ఎడ్ల నరసింహమూర్తి, వేమన గోవిందు, పాలకుర్తి క్రాంతి, కె అరుణ, బండారు సన్యాసినాయుడు, జొన్నపల్లి రమేష్, ఎర్రంశెట్టి కొండలరావు, తాడి గణేష్, కొప్పోజి రాజు, పుట్టా బలరాం, మామిడి సత్తిబాబులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పలరాజు మాటాడుతూ, నూతన కమిటీలో ఎన్నికైన కమిటీ సభ్యులు, అమ్మవారి జాతర ముగిసేంత వరకు పాత కమిటీతో కలసి పనిచేసి జాతర ఉత్సవం విజవంతం అయ్యేలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాదు శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడియ్య నాయుడు, 16మంది ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికైన కమిటీ సభ్యులు

## వైసిపి మండల అధ్యక్షుడు లెక్కల రాజీనామా

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** గొలు గొండ మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ మండల పార్టీ పదవికి బుధవారం రాజీనామా చేసారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో రాజీనామా పత్రాన్ని ఆయన గణేష్ కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన కున్న వ్యక్తిగత కారణాలతో మండల పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసానన్నారు.

రాజీనామా పత్రాన్ని ఇస్తున్న లెక్కల

## ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు చెల్లించాలి

**ప్రజాశక్తి-రావికమతం:** గత మూడు నెలల నుంచి మండు టెండలను సైతం లెక్క చేయకుండా కష్టించి పని చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ల వేతనాలు చెల్లించాలని రావికమతం మండల ఉపాధి హామీ మండల గౌరవ అధ్యక్షులు దాసరి వరహాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన జీతాలు నేటికీ ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. 18 ఏళ్ల నుంచి అరకొర జీతాలతో పని చేస్తున్న తమకు జీతాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎనిమిది వేల రూపాయలు జీతం తప్ప ఎటువంటి అలవెన్సులు ఇవ్వలేదన్నారు. ఉద్యోగ భద్రత లేదని, పనికి తగ్గ కనీస వేతనం కల్పించకపోవడం చాలా దారుణమన్నారు. తమపై విపరీతమైన ఒత్తిడి తీసుకొచ్చి పని చేయిస్తున్న అధికారులు జీతాల గురించి ఎందుకు మాట్లాడరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు మచ్చ శ్రీను, వాసరావు, కార్యదర్శి వి శ్రీను పలువురు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ సీతారామరాజు

## ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష

**ప్రజాశక్తి- నక్కపల్లి:**మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో సీతారామరాజు ఉపాధి సిబ్బందితో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. డైలీ వేజ్, వేజ్ కాంపొనెంట్, ఫారమ్ పాండ్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్, హార్టికల్చర్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, కంపోస్ట్ పిట్స్, ఇంకుడు గుంతలు తదితర పనులపై చర్చించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భాగ్యలత, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పూడిక తీస్తున్న కార్మికులు

## పారిశుధ్య పనుల పరిశీలన

**ప్రజాశక్తి-మాడుగుల:**మండలంలోని వీరవిల్లి అగ్రహారం, గాదిరాయిలో పారిశుధ్య పనులు పరిశీలించడం జరిగిందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న వీధులను, డ్రైనేజీలు పరిశీలించి,మురుగు నీరు నిల్వ ఉన్న చోట్ల నీరుపోయే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచిలు, కార్యదర్శిలు పాల్గొన్నారు.

## ఎస్ఐ వెంకటరమణకు అవార్డు ప్రదానం

**ప్రజాశక్తి-చింతపల్లి:** అల్లూరి మన్య ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తూ వ్యాపార లావాదేవీలు నిర్వహించిన పాత నేరస్తులను గుర్తించి అరెస్ట్ చేసిన చింతపల్లి ఎస్సై ఎం వెంకటరమణకు గుర్తింపు లభించింది. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పాత కేసుల ఆధారంగా నిందితు లను గుర్తించాలని చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పి నవజ్యోతి మిశ్రా ఆదేశాల మేరకు తమిళనాడు రాష్ట్రానికి వెళ్లి గంజాయి పాత నేరస్తులను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ విశేష ప్రతిభకు గుర్తింపుగా అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ చేతుల మీదుగా వెంకటరమణకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరై ఎస్సై వెంకటరమణ సేవలను ప్రశంసించారు.

# ముగిసిన విసిసి వేసవి శిక్షణ శిబిరం

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :** వేసవి సెలవుల్లో విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణతోపాటు విద్య, వైజ్ఞానిక విషయాలు, ఆటపాటల్లో తర్ఫీదునిచ్చేందుకు వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని విశ్రాంత డిఎస్‌పి రామ్‌నాయుడు కొనియాడారు. కంచరపాలెం బిఎన్ఆర్ భవన్‌లో 20 రోజులుగా విసిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్

అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

బుధవారం ముగిసింది.

ఈ సందర్భంగా రామ్‌నాయుడు మాట్లాడుతూ, సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్, ఇతర చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, వారికి విభిన్న అంశాల్లో శిక్షణనిచ్చేందుకు విసిసి కృషి అమోఘమని ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణనిచ్చిన మాస్టార్లను సత్కరించడంతోపాటు శిక్షణ శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులను అందజేశారు.

విసిసి కంచరపాలెం కన్వీనర్ కృష్ణారావు మాట్లాడుతూ, బిఎన్ఆర్ భవనంలో నిర్వహించిన విసిసి వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు సాంప్రదాయ ఆటలు, మెమరీ గేమ్స్, కరాటే, డ్రాయింగ్, చెస్, పాటలు, పద్యాలు, కథలు వంటి వాటితోపాటు నైతికవిలువలు, క్రమశిక్షణ నేర్పించామన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు 20రోజులపాటు చిన్నారులంతా ఎంతో ఉత్సాహంగా శిక్షణ శిబిరంలో పాల్గొని తన నైపుణ్యాలకు పదును పెట్టుకోవడంతోపాటు తమలోని ప్రతిభను ప్రదర్శించారన్నారు. శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా

కరాటే శిక్షణలో విద్యార్థులు

చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. వారికి నిర్వాహకులు పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఎన్ఆర్ ఫౌండేషన్ ట్రస్టీలు బుజ్జి, ఎస్.అప్పలరాజు, పెంటకోట రామారావు, ఐద్వా సీనియర్ నాయకులు ఎం. సుజాత, జన విజ్ఞాన వేదిక కృపావతి, లక్ష్మణరావు, మోహనరావు, శేషగిరి విసిసి కోఆర్డినేటరు పి.సతీష్, కృపావతి పాల్గొని సహకరించారు.

నిరసన చేపడుతున్న కూలీలు

## ఉపాధి హామీ కూలీల నిరసన

**ప్రజాశక్తి -కోటవురట్ల:** గడిచిన పది వారాలుగా ఉపాధి కూమీలకు వేతనాలు అందక పోవడంపై బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో పొందూరు గ్రామం వద్ద ఉపాధి కూలీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీలో చేపట్టిన పనులకు నిధులు తక్షణమే విడుదల చేయాలని సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యుక్త ఆధార యాప్ ప్రవేశపెడితే రాష్ట్ర హక్కులకు భంగం కలిగినట్లేని, ఇప్పటివరకు రాష్ట్రాల పర్యవేక్షణలో ఉన్న ఉపాధి పథకం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ తుందని తెలిపారు. పనుల కల్పన అంచనాల ప్రక్రియ కేంద్రమే పర్యవేక్షిస్తుందని, తద్వారా రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు, కేంద్ర ప్రభుత్వ ఆలోచన వెనక్కి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లించాలి

**ప్రజాశక్తి-నక్కపల్లి:** మండలంలోని చందనాడ గ్రామంలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన పట్టా భూముల్లో ఇండ్లకు పరిహారం ప్యాకేజీ చెల్లించి నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పుణ్యమంతుల బాబ్జి, గ్రామస్తులు కోరారు. బుధవారం నర్సీపట్నంలో ఆర్డిఓ వీవి రమణను కలిసి సమస్యను విన్నవించి వినతిపత్రం అందజేశారు. ఇల్లులు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం చెల్లించాలని ఆర్డిఓను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి బాబ్జి, పుణ్యమంతుల రాజు, రవి, సూరకాసుల శ్రీను, కృష్ణారావు, నానాజీ, హనుమంతు, కర్రి వీర వెంకట సత్యన్నారాయణ, నానాజీ పాల్గొన్నారు.

## తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా రెండో రోజు బుధవారం ఎల్ఐసిదరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల వేతనం రూ.18,500 చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. యజమాని వాటా పిఎఫ్, ఈఎస్ఐను యాజమాన్యం చెల్లించాలన్నారు. చట్టప్రకారం వీక్లీఆఫ్, పండగ, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.సతీష్, ప్రధాన కార్యదర్శి పి. ఆనంద్, బి. రాజులు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** వివాహ, వేసవి సీజన్‌ను పురస్కరించుకుని భారతీయ చేనేత సాంప్రదాయ సంపూర్ణ వస్త్రాల ప్రదర్శన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను బుధవారం గ్రీన్‌పార్క్ హోటల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వివాహ వేడుకల కోసం సంస్కృతి సంప్రదాయం, ఆధునికత కలబోసిన వస్త్ర

సంపద ఒకేచోట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఈ రోజు నుండి 26వ తేదీ వరకూ 6 రోజులు పాటు ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో షాపింగ్ చేయడంలో ఒక గొప్ప మధురానుభూతిని పొందుతారని నిర్వాహకులు తెలిపారు. వివాహాది వేడుకలను ఎంతో ఆడంబరంగా జరుపుకోవటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్న వారికి, వేసవికి కావలసిన విభిన్న నేతవస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శనలో వేలాదిరకాల సిల్క్, కాటన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు మొదలైనవి అన్నీ ఒకేచోట లభిస్తాయన్నారు. నేత కార్మికులు తమ వస్త్రాలపైన 50 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నారన్నారు. ఈ ప్రదర్శనలో మహారాష్ట్రకు చెందిన సొగసైన పైథాని సిల్క్ చీరలు, కర్ణాటకకు చెందిన బెంగుళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదాసిల్క్ చీరలు, పేరొందిన మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి సిల్క్‌చీరలు, పశ్చిమబెంగాల్ బలూచారి, జమ్దానీ, టాంగైల్, ఢకాయ్ మాస్లిన్ సిల్క్ చీరలు, లినెన్ శారీ కాంతా వర్క్ స్టిచ్‌చీరలు ఎన్నో రాష్ట్రాల నుండి తయారీదారులు తెచ్చినవి నేరుగా కొనుగోలు చేయవచ్చున్నారు. ఈ ఎక్స్‌పోలో చీరలు, దుపట్టాలు, సల్వార్ మెటీరియల్ వివిధ డిజైన్‌లు, మోడల్స్ లో లభిస్తాయన్నారు. వీటిలో బీహార్‌కు చెందిన టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్‌చీరలు, గుజరాత్‌కు చెందిన సాంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా చీరలు, తమిళనాడుకు చెందిన కంజీవరం చీరలతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్ చీరలు, జమ్ము కాశ్మీర్ తాబీ సిల్క్‌చీరలు ఎన్నెన్నో ఈ ప్రదర్శనలో పొందవచ్చున్నారు. బనారస్ పట్టుచీరలు, జమదాని, సిఫాన్ చీరలు, లక్నవి చికాన్ వర్క్ చీరలు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ నుండి వచ్చిన బంధిని, బందేజ్, హేండ్ బ్లాక్ ప్రింట్ చీరలు పొందవచ్చున్నారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 11 నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితం అన్నారు. అన్నిరకాల డెబిట్, క్రెడిట్‌కార్డులు స్వీకరిస్తారని తెలిపారు.

## ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రి సమీక్ష

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:** జూన్ 21వ తేదీన ప్రధాని విశాఖ పర్యటనలో భాగంగా ఏర్పాట్లను రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సమీక్షించారు. బుధవారం ఆర్కేబీచ్ రోడ్డు వద్ద విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్‌కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్‌లతో కలిసి ప్రత్యేకంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి భద్రత ఏర్పాట్లపై అధికారులకు పలుసూచనలు చేశారు. యోగా డేకు రాష్ట్రం నలుమూలల నుండి జనం భారీగా రానున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆమె సమీక్షించారు ప్రధాని పర్యటనలో అధికారులు సమన్వయంతో సమర్ధంగా పనిచేయాలని జిల్లా అధికారి యంత్రాంగాన్ని హోంమంత్రి ఆదేశించారు.

## అలరించిన సినీ సంగీత విభావరి

**ప్రజాశక్తి-సీతమ్మధార :** అలనాటి మేటి నటులు చంద్రమోహన్, రంగనాథ్ నటించిన వివిధ చిత్రాలలో గీతాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపించి అలరించారు. బుధవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో సత్య సుమధుర స్వరాలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు కట్ట మల్లేశ్వరరావు, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్ మూర్తి, అధ్యక్షురాలు సత్యవతి ఖాన్, రాజేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి సంగీతవిభావరిని ప్రారంభించారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు పిబి ఖాన్, లక్ష్మీ స్వరూప, మాధురి, గంటి ఉష, శోభారాణి, రంజిత,

గీతాలను ఆలపిస్తున్న గాయకులు

పెమ్మరాజు రామ్, కే ఎల్ రావు, శంకర్, నాయుడు తదితరులు పలు సినీ గీతాలతో ఆకట్టుకున్నారు. 'రా దిగిరా దివి నుంచి దిగిరా భువికి దిగిరా' అనే శీర్షిక నిర్వహించిన సంగీత విభావరిలో అలనాటి మేటి తెలుగు, హిందీ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో మంజుల, తుని మణి, జి.మురళి తదితరులు పాల్గొన్నారు. కళా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులను నెమర వేసుకున్నారు.

## చర్చనీయాంశంగా ఉక్కు కాంట్రాక్టు కార్మికుల గేట్ పాస్‌ల రద్దు మెసేజ్

**ప్రజాశక్తి - విశాఖపట్నం :** ఉక్కు కార్మికుల సమ్మె నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ఇంజినీర్ ఇన్‌ఛార్జి పేరిట వచ్చిన ఓ మెసేజ్ బుధవారం రాత్రి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'అందరి కాంట్రాక్టు వర్కర్ల గేట్ పాస్‌లూ రద్దు చేస్తున్నాం. కొత్తగా పనిలోకి రాదలుచుకున్నవారు మమ్మల్ని సంప్రదించవచ్చు. బి - షిఫ్ట్‌కు అనుమతిస్తాం' అన్నది ఆ మెసేజ్ సారాంశం. రెండు రోజులుగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి ఇలాంటి కక్షసాధింపు చర్యలకు ఉక్కు యాజమాన్యం దిగడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో
మీ ప్రకటన
వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి
సిటీ : 9490099125
మధురవాడ : 8008596645
గాజువాక : 9849392359
అనకాపల్లి : 8008736188
చోడవరం : 9490099141
నర్సీపట్నం : 9440280411
పాడేరు : 9490099142
రంపచోడవరం : 9440165617
పూర్ణమార్కెట్ : 9490099676
జగదాంబ : 9490099434
జివియంసి : 9490099483
ద్వారకానగర్ : 9490099672
కంచరపాలెం : 9490099135
మాదవధార : 9490099675